# సమర్థుడి జీవిత యాత్ర

-పంజాల జగన్నాథం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళలు సాంకేతిక శాఖ నుండి ఉత్తరం. జగదీశ్ విప్పి చదివాడు, "శ్రీహరి చేస్తున్న కళాసేవకు ప్రభుత్వం వారిచే పురస్కారం. ఉగాది రోజున రవీంద్రభారతిలో జరిగే ఉత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రం, యాభై వేల రూపాయల చెక్కు బహూకరణ. 'కళాబ్రహ్మ' బిరుదు ప్రదానం, సన్మానం"-అని ఉంది. 'నాన్నా' అంటూ జగదీశ్ సంతోషంతో ఇంట్లోకి వెళ్లి ఉత్తరం నాన్నకు చూపించాడు. వయస్సు యాభై దాటిన శ్రీహరి ఏదో కళాకృతిని రూపకల్పన చేయడంలో నిమగ్నమై ఉన్నాడు. ఉలి సుత్తెను పక్కనబెట్టి కళ్లద్దాలు సవరించుకొని కొడుకు ఇచ్చిన ఉత్తరాన్ని చదువసాగాడు. ఆశ్చర్యం, ఆనందం-రెండూ ఒకేసారి కలిగాయి. పేలవంగా నవ్వాడు. 'మన కళకు గుర్తింపు ఇప్పుడొచ్చిందన్న మాట. దగ్గర ఉన్న కొడుకును ప్రేమతో కావలించుకున్నాడు. ఆనందబాష్పాలు చెక్కిళ్లను అభిషేకిస్తున్నాయి.

మరుసటి రోజు ఉగాది. తనకు సన్మానం, శ్రీహరి మస్తిష్కంలో ఎన్నో ఆలోచనలు, అవమానాలు, అనుభూతులు అన్నీ కలగాపులగంగా కదులుతున్నాయి. 'ప్రభుత్వం ఇచ్చే పురస్కారాన్ని తను తిరస్కరిస్తే తన హితులకు, సన్నిహితులకు కోపం రావచ్చునేమో! మొండివాడు. లౌక్యం తెలియని వెర్రివాడని అనుకుంటారేమో...! పలువిధాలా ఆలోచించసాగాడు శ్రీహరి, చివరకు పురస్కారాన్ని స్వీకరించడానికే నిర్ణయించుకున్నాడు.

శ్రీహరి కొడుకు జగదీశ్‌తో పురస్కార స్వీకారానికి బస్సులో హైద్రాబాద్‌కు ప్రయాణమయ్యాడు. బస్సులో శ్రీహరి కిటికీ నుండి వెలుపలికి చూస్తున్నాడు. కొండలు, కోనలు, చెట్లు, చేమలు వెనక్కు పరుగెత్తుతున్నాయి. కిటికీ నుండి చల్లని గాలి రివ్వున వీస్తోంది. శ్రీహరి బుర్రలో ఎన్నో జ్ఞాపకాలు రొద చేస్తున్నాయి. మనస్సుకు ఊపిరి సలుపనివ్వడం లేదు. ఏదో తెలియని ఉద్వేగం, ఆవేశం, ఆవేదన...తన బాల్యం ఎట్లా గడచిందీ, ఎవరెవరు 'ఛీ!' కొట్టిందీ, ఆదుకున్నదీ అన్నీ సినిమా రీలులా కళ్లల్లో కదులుతున్నాయి. ఆలోచనలతోనే హైద్రాబాద్ చేరుకున్నాడు.

విద్యుత్ దీపాల కాంతిలో రవీంద్ర భారతి హాలు ధగధగ మెరిసిపోతోంది. హాలంతా అతిథులు, అభిమానులతో కిటకిటలాడుతోంది. వివిధ రంగాలలో విశేష కృషి సల్పిన ప్రముఖులకు పురస్కారం ప్రదానం చేయబోతున్నారు. పురస్కారం పొందబోయేవాళ్లు ముందు వరుసల్లో కూర్చున్నారు, విఐపిలు, పారిశ్రామిక వేత్తలు, పలు సంఘాల ప్రతినిధులు ఆ సమావేశ మందిరంలో ఆశీనులయి ఉన్నారు. ప్రత్యేకంగా కేటాయించబడిన విభాగంలో మీడియా పర్సన్స్, వీడియోగ్రాఫర్స్ కూర్చున్నారు. అంతా గవర్నర్ రాక కోసం ఎదురు చూస్తున్నారు. గవర్నర్ వేదిక మీదికి రాగానే గౌరవ సూచకంగా అందరూ లేచి నిలబడ్డారు. ప్రార్థనా గీతం వందేమాతరం ఆలాపించాక అందరూ తమ సీట్లలో కూర్చున్నారు. హాలంతా నిశ్శబ్దం. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ సాంప్రదాయ సంగీతం సన్నగా మృదుమధురంగా వినిపిస్తోంది. 'పురస్కార' కార్యక్రమం మొదలయింది. గవర్నర్ చేతుల మీదుగా అవార్డు గ్రహీతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాల బహూకరణ జరుగుతోంది.

చక్కం పనిలో చూపిన నైపుణ్యానికి, ప్రతిభకు గుర్తుగా శ్రీహరికి 'కళాబ్రహ్మ' గౌరవ బిరుదును, మెమొంటోను, యాభై వేల రూపాయల చెక్కును గవర్నర్ చేతుల మీదుగా బహూకరించి మంగళ వాయిద్యాల మధ్య పూలమాలాలంకృతుణ్ణి చేసి

శాలువాతో సత్కరించారు. పూలవర్షం కురిపించారు. కెమెరాలు క్లిక్‌మన్నాయి. ఫ్లాష్‌లు తళుక్కుమన్నాయి. మీడియాకు సంబంధించిన వీడియోగ్రాఫర్లు తమవంతు షూటింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పురస్కార గ్రహీతలు తమతమ అభిప్రాయాలను, మనోభావాలను వెలిబుచ్చారు. చెమ్మగిల్లిన కన్నులతో శ్రీహరి మాట్లాడుతూ 'ఒక దయామూర్తి ఔదార్యం వల్ల నేనింతటి వాణ్నయ్యాను. నా కళను వృద్ధి చేసుకున్నాను. నా కళా నైపుణ్యాన్ని గుర్తించి నన్ను గౌరవించినందుకు కృతజ్ఞుణ్ణి. ఎన్ని కష్టాలొచ్చినా ధైర్యం కోల్పోకుండా పట్టుదలతో కృషి చేస్తే అనుకున్నది సాధించగలం !' అని ధన్యవాదాలతో సెలవు తీసుకున్నాడు. జనం చప్పట్ల మధ్య శ్రీహరి వేదిక దిగిపోయాడు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన గవర్నర్ పురస్కార గ్రహీతల కళా ప్రతిభను, ప్రజాసేవను కొనియాడుతూ మాట్లాడాడు. చివరగా శ్రీహరి గురించి మాట్లాడుతూ "శ్రీహరి ఒక కళాకారుడే కాదు. గొప్ప మానవతావాది. సమాజ సేవకుడు. ఆయన జీవితం ఆదర్శప్రాయం. ఈ శుభ సందర్భాన పురస్కార గ్రహీతలందరికి హృదయ పూర్వక శుభాకాంక్షలు." అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

సమయాభావం వల్ల సభాధ్యక్షులు పురస్కార గ్రహీతల సేవలను కొనియాడుతూ క్లుప్తంగా మాట్లాడి తమ ఉపన్యాసాన్ని ముంగించారు. సభా నిర్వాహక కమిటి సభ్యుని ధన్యవాదాలు. తదనంతరం జాతీయ గీతంతో సభ ముగిసింది.

'తను కష్టాల్లో ఉన్నప్పుడు ఎవరు ఆదుకున్నారు? ఓ స్థాయికి చేరుకున్నాక అందరూ చుట్టాలే, లోకం తీరే అంత. డబ్బు, దస్కం, పరువు, ప్రతిష్ట ఉన్నప్పుడు అందరూ దగ్గరి వాళ్లే, అవి లేని నాడు మనకు ఎవరూ ఉండరు'. శ్రీహరి వేదాంతిలా నవ్వాడు. ప్రభుత్వం ప్రదానం చేసిన పురస్కారం తనకు తృప్తిని ఇవ్వలేకపోయింది. శ్రీహరి బుర్రను పలు భావాలు తొలిచేస్తుండగా కొడుకు జగదీశ్‌తో కరీంనగర్‌కు బయలుదేరాడు.

శ్రీహరి దంపతులకు ఇద్దరు కొడుకులు. పెద్దబ్బాయి జగదీశ్, చిన్నబ్బాయ్ అశోక్. జగదీశ్ బయటి వ్యవహారాలు, అశోక్ పరిశ్రమలోని కార్వింగ్ వర్క్, కార్మికుల అవసరాలను చూసుకుంటారు. శ్రీహరి భార్య సాంప్రదాయ గృహిణి. ఇంటి వ్యవహారాలు చూసుకుంటూ భర్తకు చేదోడు, వాదోడుగా ఉంటుంది. శ్రీహరి ఎప్పటికప్పుడు కొత్త కొత్త కళాకృతులు, కళాఖండాలకు రూపకల్పన చేయడంలోనే నిమగ్నమై ఉంటాడు.

శ్రీహరి బాల్యంలోనే తండ్రి చనిపోవడంతో చదువు మానేశాడు. తల్లి సాయంగా కుటుంబం గడవడానికి కూలీ చేశాడు. పాలేరుగా ఉన్నాడు. కొద్ది కాలానికే జ్వరంతో మంచాన పడి తల్లి చనిపోయింది. శ్రీహరికి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది, తల్లివైపు బంధువులు ఎవరూ లేకపోవడంతో అనాథ అయినాడు. కుటుంబ కలహాల వల్ల ఏనాడో ఉమ్మడి కుటుంబం బద్దలైంది. శ్రీహరి నాన్న, పెదనాన్నలు విడిపోయి చాలాకాలం అయింది. రెండు కుటుంబాల మధ్య సంబంధాలు లేకండా పోయినాయి. తమ్ముడు, మరదలు పోయాక అనాథగా మిగిలిన శ్రీహరిని వాళ్ల పెద్దనాన్న జాలిపడి చేరదీశాడు. కులవృత్తి వడ్రంగి పని తనకు తెలిసిన మేరకు చక్కం పనిని నేర్పించాడు. ఇవన్నీ శ్రీహరి పెద్దమ్మ ఓర్వలేపోయింది. శ్రీహరి విషయమై భార్యాభర్తలిద్దరూ తరచూ ఘర్షణ పడుతూ ఉండేవారు. ఇది గ్రహించిన శ్రీహరి పసి హృదయం తట్టుకోలేదు, ఓ రాత్రి చెప్పా చేయకుండా సంచిలో తాను తొడుక్కొనే బట్టలు పెట్టుకొని ఊరి నుండే వెళ్లి పోయాడు. కరీంనగర్ చేరుకున్నాడు. శ్రీహరికి ఏమిచేయాలో పాలుపోలేదు. బతుకే అతనికి ఒక ప్రశ్నగా మారింది. బంగ్లాలకు కంకర, ఇసుక మోసిందు. సిమెంటు అందించిందు. బస్టాండ్ల సామాన్లు మోసిందు. హోటల్ల కప్పులు కడిగిందు. బన్ను చాయ్‌తో కడుపు నింపుకున్నడు. అప్పుడప్పుడు నల్లానీళ్లు దాగి ఫుట్‌పాత్‌ల మీదనే పడుకునేది. ఎండకు ఎండేది, వానకు తడిచేది. చలికి వణికేది.

శ్రీహరి తన పెద్దనాన్న నుండి అంది

పుచ్చుకున్న చక్కం పనిలో ఏదో చేయాలనే తపన మొదలయింది. జీవనోపాధి కొరకు ఓ కఱ్ఱ సహకార సంస్థల కూలిగా చేరాడు. వఱ్ఱంగి పని జేసేవాడు. తీరిక వేళల్ల, రాత్రిల్లు పనికిరాని కఱ్ఱముక్కలతో ఏవేవో ఆకృతులను చేసేవాడు. అట్లా చక్కం పనిని ఏకలవ్యుని రీతిలో నేర్చుకున్నాడు. శ్రీహరి ఆసక్తిని గమనించిన వెంకట్రామయ్య అనే ఓ మహానుభావుడు వెన్నుతట్టి చేయూత నిచ్చాడు. క్యాన్సర్‌తో బాధ పడుతూ రోజులు లెక్కిస్తూ బతుకుతున్న ఆయన తన జీవితానికి అర్థం, పరమార్థం ఉండాలని శ్రీహరిని చేరదీశాడు. చదువు చెప్పించాడు. చక్కం పనిని శాస్త్రోక్తంగా నేర్చుకోడానికి కావలసిన పుస్తకాలను, శిక్షణను ఏర్పాటు చేశాడు. స్వతహాగా శ్రీహరి తెలివైన వాడు కాబట్టి ఆ కళను ఇట్టే అవపోసన పట్టేశాడు. అనతి కాలంలోనే వెంకట్రామయ్యను క్యాన్సర్ కబళించింది. వెనుకా ముందూ ఎవరూ లేని వెంకట్రామయ్యకు శ్రీహరి వారసుడిగా మిగిలాడు. వెంకట్రామయ్యకు ఆఖరుగా స్థిరాస్తిగా మిగిలిన ఒకే ఒక ఇల్లును శ్రీహరి ఆయన స్మారకార్థం గ్రంథాలయానికి అర్పించాడు.

శ్రీహరి చిన్నగా కార్వింగ్ వర్క్‌ను బ్యాంకు ఋణంతో కుటీర పరిశ్రమగా మొదలుపెట్టాడు. యువకులకు శిక్షణ ఇచ్చి పనిలో నియోగించాడు. టేకు, జిట్రేగి ఇతర కఱ్ఱతో సోఫాలు, మంచాలు, తలుపులు, కిటికీలు, ద్వార బంధాలు, డ్రెస్సింగ్ మిర్రర్స్, మైల్‌దాన్‌లు, సత్యనారాయణ వ్రతం పీటలు, డైనింగ్ టేబుళ్ల మొదలగు గృహోపకరణ వస్తువులు తయారు చేసి వాటిపై అదనపు ఆకర్షణలుగా మంచి మంచి డిజైన్లు లతల్నీ చెక్కి కళాత్మకంగా మలిచేవాడు. ఇంకా శ్రీహరి చేతి నుండి ఎన్నో కళారూపాలు ఆవిర్భవించాయి. కొయ్యలతో దేవతారూపాల్నీ, స్వాగతద్వారాల్నీ, సింహముఖ ద్వారాల్నీ, దీపకలశాల్నీ హంసతూలికా తల్పాల్నీ ఎన్నో డిజైన్లతో రూపొందించేవాడు. ఆధునిక చిత్రకళకు సంబంధించి ఒకే కొయ్యలో మనిషి, జంతు, పక్షి చేప, మొసలి ఆకృతులను చెక్కేవాడు, శ్రీహరి కళాఖండాలకు గిరాకి పెరిగింది, కళా పరిశ్రమ వ్యాపారం అంచెలంచెలుగా ఎదిగింది. శ్రీహరి ఆర్థికంగా పుంజుకున్నాడు. కొంతమంది నిరుద్యోగ యువకులకు కళా పరిశ్రమలో తర్ఫీదు ఇచ్చి తన పరిశ్రమలోనే జీవనోపాధి కల్పించాడు. కళా పరిశ్రమలో యువతకు శిక్షణా శిబిరాలను నిర్వహించాడు. తన దగ్గర శిక్షణ పొందిన ఎందరో యువకులు ఆర్ట్ స్టుడియోలో పని జేస్తున్నారు. కష్టమర్ల అభిరుచులకు అనుగుణంగా ఎన్నో కళారూపాలను, డిజైన్లను చేసేవాడు.

'కరీంనగర్' అన్న కండక్టర్ కేకతో శ్రీహరి గత జ్ఞాపకాల దొంతరల నుండి బయటపడ్డాడు. కొడుకు జగదీశ్‌తో ఆటోలో ఇంటికి బయలు దేరాడు. ఇంటివద్ద భార్య చిన్నకొడుకు అశోక్, తన పరిశ్రమలో పని చేసే కార్మికులు ఆనందాన్ని అణచుకోలేక ఆతృతతో ఎదురుచూస్తున్నారు.

శ్రీహరి తన జీవితంలో ఎన్నో సుడిగాడ్పులు, జడివానలు ఎదుర్కొన్నాడు. తన పెదనాన్న నుండి ఓనమాలు దిద్దిన చక్కం కళను వారసత్వంగా ఇద్దరు కొడుకులకు నేర్పించాడు. తన దగ్గర శిక్షణ పొందిన ఎందరో యువకులు ఆయా కళారంగాల్లో స్థిరపడి బాగానే ఆర్జిస్తున్నారు. శ్రీహరి తన శిష్యులను, కొన్ని స్వచ్ఛంద సంస్థలను సంప్రదించి తన ఉన్నత స్థితికి కారణమయిన మహానుభావుడు 'వెంకట్రామయ్య' పేరిట ఛారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేశాడు. కొన్ని ఉన్నతాశయాలతో ఏర్పాటు చేసిన ట్రస్టుకు తానే ట్రస్టీగా వ్యవహరిస్తున్నాడు. భావసారూప్యత గల వ్యక్తుల నుండి కొంత నిధిని సమకూర్చి ట్రస్టు పేరిట బ్యాంకులో జమ చేశాడు. దాని ద్వారా పలు సాంఘిక సేవా కార్యక్రమాలు చేపట్టాడు. వృద్ధులకు, వికలాంగులకు, అనాధలకు ఆశ్రమాలు నెలకొల్పి ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్నాడు. శ్రీహరి యొక్క ఉన్నతమైన జీవితాశయాన్ని గమనించి పెద్ద మనసున్న ఎందరో దాతలు చేయూతనిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు సహకరిస్తున్నాయి. కన్న తల్లిదండ్రుల, పుట్టినూరు ఋణం తీర్చుకోవాలనే తపనతో తన ఊరిలో 'వెంకట్రామయ్య' స్మారక విద్య వైద్యాలయాలు స్థాపించి ఉచిత సేవలను అందిస్తున్నాడు.

సమాజ సేవకే అంకితమయిన శ్రీహరిని కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఉచిత రీతిన సత్కరించతలపెట్టాయి. ఆ విషయమై శ్రీహరిని సంప్రదించాయి. సహజంగానే వీటికి దూరంగా ఉండే శ్రీహరి తన ఊరిలోనే ఈ ఏర్పాటు చేస్తున్నామని తెలుపగానే తన ఊరి ప్రజలతో కలిసి ఆత్మీయంగా మాట్లాడాలనే కోరికతో ఒప్పుకున్నాడు. సన్మాన సభ జరిగే రోజు రానే వచ్చింది. శ్రీహరి స్వంత ఊరు మహదేవ్‌పూర్. కరీంనగర్‌కు నూరు కిలోమీటర్ల దూరంలో గోదావరి తీరాన ఉంది. ఊరు చుట్టూ దట్టమైన అడవి. కొండలు, కోనలు, సెలయేర్లు... ప్రకృతి శోభాయమానంగా ఉంది. శ్రీహరి తన భార్య, ఇద్దరు కొడుకులతో మహదేవ్‌పూర్ చేరుకున్నాడు. అభినందన సభకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఊరి ముఖద్వారాల్లో మామిడి తోరణాలు కట్టారు. నరికిన అరటి చెట్లను నిలబెట్టారు. విద్యుత్ స్థంభాలు, టెలిఫోన్ స్థంభాలు, చెట్ల కొమ్మలను కలుపుతూ రంగురంగుల త్రికోణపు కాగితపు జెండాలతో అలంకరించారు. శ్రీహరికి అన్ని సౌకర్యాలతో అధునాతనమైన ఇంట్లో విడిది ఏర్పాటు చేశారు. అయినా శ్రీహరి అందులో బస చేయలేదు. తను బాల్యంలో గడిపిన పూరింటికి వెళ్ళాడు. అది శిథిలావస్థలో ఉంది. ఇంటి పరిసరాలను ఒకసారి కలియజూశాడు. తను ఎట్లా ఆడిందీ, పాడిందీ అంతా కళ్లల్లో సినిమా రీలులా కదిలింది. శ్రీహరి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. అటు నుండి చిన్నప్పుడు చక్కం పనిలో శ్రీకారం దిద్దించిన పెదనాన్న ఇంటికి వెళ్లాడు.

సన్మాన సభను కాలేజి గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. చెక్కలతో ఎత్తయిన వేదికను తయారుచేశారు. తివాచీలు పరిచారు. పరదాలు కట్టారు. సభా ప్రాంగణమంతా రంగురంగుల జెండాలు, రెపరెపలాడుతున్నాయి. లైట్లు, మైకులు అమర్చారు. మైకులో దేశభక్తి గీతం వినబడుతోంది. శ్రీహరి చాలా నిరాడంబరంగా కుటుంబసభ్యులతో సభాస్థలికి చేరుకున్నాడు. ఓ పక్కన కూర్చున్నాడు. పైకి సాధారణంగా కనబడుతున్న శ్రీహరి అంతరంగం గంభీరంగా

## భయపడని వాడు

అతనికి నిప్పులా మండటం తెలుసు
నివురు గప్పిన నిప్పులా వుండటం తెలీదు
మాటల గుళ్ళు పేల్చటం తెల్సు
మాయమాటలు తెలీదు
నవ్వటమే తప్పు ఏడవటం తెలీదు
ముందు నుంచి కత్తి దూయటమే తప్ప
వెన్నుపోటు పొడవటం తెలీదు
ఎల్లప్పుడూ ఎర్ర బావుటాలా
రెపరెపలాడుతుండే వాడు
మాటల మృదంగం ఎప్పుడు వాయించినా
అది లయబద్ధంగా స్వరబద్ధంగా వాయించేవాడు
ఒక్కొక్క బంధాన్నీ తెంపుకుని
ఎటు పోవాలో ఎలా బతకాలో నిర్ధారించుకొని
ఎవరినీ లెక్క చేయకుండా బతికాడు
ఒంటరి యోధుడిలా బతికాడు
అతనికి
పర్వతం విరిగి పైన పడుతుందని భయం లేదు
సెంటిమెంట్ల సెంటు పూసుకోలేదన్న భయం లేదు
ఒంటరిగా ఒంటి స్తంభం గుహలో
వుండటమన్నా భయం లేదు
నిరంతరం అలుపెరుగకుండా
పరుగెత్తడమన్నా భయం లేదు
ఎక్కడున్నా ఎవరి మధ్య నున్నా
పెదవుల మధ్య తెల్లని సన్నాయితో
పొగపాటలు పాడ్డానికి సైతం భయపడలేదు
ఎవరికీ భారం కాకుండా
ఎవరికీ పని చెప్పకుండా
చీదరింపులూ, విసుక్కోవడాల
జడివానలో తడిసి తడిసి ముద్దవకుండా
మొన్న కలిసినప్పుడు సైతం
ఎక్కడ దిగనున్నాడో మాట మాత్రంగానైనా
ఒక్క మాట కూడా చెప్పకుండా
హఠాత్తుగా బతుకు బండి నుండి దిగేసి
కనిపించకుండా మాయమయ్యాడు.

*(మిత్రుడు డి.టి.జి. వీరభద్రరావు ఆకస్మిక మరణ వార్త విని)*

–మాధవీ సనారా

ఉంది. అతని నుదుటిపై కనబడుతున్న చారలే జీవితంలో అతను ఎదుర్కొన్న ఒడిదుడుకులకు గుర్తుగా మిగిలాయి. సన్మాన సభకు కేంద్రీయ విశ్వవిద్యాలయం లలిత కళలు-సాంకేతిక విద్యా విభాగపు ప్రొఫెసర్ శ్రీ దాస్యం సేనాధిపతి గారు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సభాధ్యక్షులుగా స్వచ్ఛంద సంస్థల సమాఖ్య చైర్మన్ శ్రీ బెనర్జీ గారు వ్యవహరించబోతున్నారు. సభలో వీళ్లంతా ముందు వరుసలో కూర్చున్నారు. సభా నిర్వాహక కమిటి సభ్యుడు స్వాగత వచనాలు చెబుతున్నాడు. సభకు స్వాగతం అంటూ 'ఈ రోజు కళాసేవకుడు సమాజ సేవకుడు అయిన గౌరవనీయులు శ్రీహరి గారి సన్మానసభకు స్వచ్ఛంద సంస్థల సమాఖ్య చైర్మన్ శ్రీ బెనర్జీ గారిని అధ్యక్షత వహించాల్సిందిగా కోరుచున్నాను' అంటూ కమిటి సభ్యుడు ఆహ్వానించాడు. తదుపరి ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌరవనీయులు సెంట్రల్ యూనివర్సిటి ప్రొఫెసర్ శ్రీ దాస్యం సేనాధిపతి గారు వేదిక పైకి వచ్చి ఆసీనులు కావల్సిందిగా మనవి చేయుచున్నాను. అలాగే సన్మానాన్ని గ్రహించబోయే గౌరవనీయులైన శ్రీహరి గారిని వేదిక మీదికి వచ్చి ఆసీనులు కావలసిందిగా ప్రార్థిస్తున్నాను,' స్వాగత వచనాలు ముగిశాయి. సభను నిర్వహించాల్సిందిగా సభాధ్యక్షుల వారిని కోరుతూ ఎజెండా పత్రాన్ని సమర్పించాడు కమిటి సభ్యుడు.

సభాధ్యక్షులు, ప్రొఫెసర్, శ్రీహరి వేదిక మీద ఆసీనులై ఉన్నారు. సభాధ్యక్షులు లేచి మైకు తీసుకొని 'వేదిక మీదున్న పెద్దలు, సభికులకు నమస్కారం. ఈ సభకు ఒక విశిష్టత ఉంది. మనం ఇప్పుడు ఇంత కాలంగా అజ్ఞాతంగా ఉన్న ఒక గొప్ప మానవతా వాదిని సన్మానించబోతున్నాం. సమాజానికి ఆయన చేసిన అమూల్యమైన సేవలకు గాను ఏదో చంద్రుడికో నూలుపోగులా శ్రీహరి గారిని సన్మానించతలుచుకున్నాం' అంటూ శ్రీహరిని వేదికపై ప్రత్యేకంగా ఏర్పరిచిన ఆసనం వద్దకు తోడ్కొని వెళ్లి కూచోబెట్టాడు. కమిటి సభ్యుడు పూలమాలాంకృతుడిని చేశాడు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ సేనాధిపతి గారిచే శాలువతో సత్కరింపజేశారు. కమిటి సభ్యుడు పూలమాలాంకృతుణ్ణి చేశాడు. ఆయన సేవలను కొనియాడుతూ ప్రశంసా పత్రాన్ని, జ్ఞాపికను సమర్పించారు. స్వచ్ఛంద సంస్థల సమాఖ్య తరపున 'కళా తపస్వి' 'ప్రజాబంధు' బిరుదులతో గౌరవించారు. వివిధ సంఘాల వారు పూలమాలలు, పుష్పగుచ్ఛాలు సమర్పించారు. సన్మాన కార్యక్రమం అనంతరం సభాధ్యక్షులు ముఖ్యఅతిథి ప్రొఫెసర్ దాస్యం సేనాధిపతి గారిని మాట్లాడవలసిందిగా కోరారు.

ప్రొఫెసర్ గారు లేచి మైకు వద్దకు వెళ్లి సభకు నమస్కారం అంటూ తన ప్రసంగాన్ని ఆరంభించాడు. 'శ్రీహరి లాంటి మహోన్నత వ్యక్తి, గొప్ప మానవతావాది సన్మాన సభకు నన్ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించినందుకు నాకెంతో ఆనందంగా ఉంది. ఆయన కళకు, సమాజ సేవకు అంకితమైన మహానుభావుడు. పేదరికంలో మగ్గే కళాకారులకు డబ్బు, విద్య లేక సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా ఇమడలేక దుర్భర పరిస్థితుల్లో బతుకులు వెళ్లదీస్తున్నారు. ఎవరికీ పట్టని కళాకారుల కోసం విద్యాలయాన్ని స్థాపించి స్కూలు స్థాయి వరకు ఉచిత విద్యను అందిస్తూ వాళ్ల సంక్షేమం కొరకు అలుపెరగకుండా కృషి చేస్తోన్న గొప్ప వ్యక్తి, స్వతహాగా విప్లవ భావాలున్న శ్రీహరి గారు సమాజంలో నిరాదరణకు గురవుతున్న కళాకారుల హక్కుల కోసం నిత్యం పోరాడుతూనే ఉన్నారు. ఆయన కలకాలం ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని ఇలానే ఇంకా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షిస్తూ శ్రీహరి గారిని మనసారా అభినందిస్తూ సెలవు తీసుకుంటున్నాను' అంటూ ప్రసంగాన్ని ముగిస్తూ ప్రొఫెసర్ తన సీట్లో కూర్చున్నాడు.

చివరిగా సభాధ్యక్షులు లేచి సభకు నమస్కరించి మాట్లాడుతూ 'శ్రీహరి లాంటి మహనీయుని గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆయన గొప్ప మానవతావాది, సంఘ సేవకుడు, పేదల పాలిటి దైవం. శ్రీహరి ఎన్నో కష్టాల్ని ఎదుర్కొని స్వయంకృషితో ఈ స్థాయికి ఎదిగారు. ఎంత ఉన్నతమైన స్థితిలో ఉన్నా తన మూలాలను,

తన తల్లి వేర్లను మరిచిపోలేదు. బాధితులకు, పేదలకు చేయూత నిస్తూనే ఉన్నాడు. శ్రీహరి తన జీవితంలో నిలదొక్కుకోవడానికి సహకరించిన వెంకట్రామయ్య స్మారకార్థం ఆయన పేరిట వృద్ధులకు, వికలాంగులకు, అనాధలకు ఆశ్రమాలను నిర్వహిస్తున్నారు. తన స్వంత ఊరిలో తాగునీటి వసతికై బోర్‌వెల్స్ వేయించాడు. హైస్కూలు, ఆసుపత్రులను స్థాపించి ఉచిత విద్య, వైద్య సదుపాయాల్ని కల్పించాడు. ఇంకా బ్లడ్ బ్యాంక్, ఐ-బ్యాంక్ లాంటి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారు. కళాకారులు, సాహితీవేత్తలు గోరంత చేసి కొండంత కీర్తి కొరకు ప్రాకులాడటం. ప్రచారం కోసం పత్రికల్లో రాయించుకొని సన్మానం చేయించుకునే ఈ రోజుల్లో ట్రస్టును ఏర్పరచి ఇంత సేవ చేస్తూ అజ్ఞాతంగా ఉన్న శ్రీహరి గారి వ్యక్తిత్వం ఎంతో ఉదాత్తమైనది. వారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేసుకుంటూ ఈ ఊరి ప్రజల్ని కళాకారులనుద్దేశించి తమ అమూల్యమైన సందేశాన్ని ఇవ్వాల్సిందిగా కోరుతున్నాను.' అంటూ సభాధ్యక్షులు ముగించారు.

శ్రీహరి ముకుళిత హస్తాలతో నెమ్మదిగా మైకు వద్దకు వెళ్లాడు. వేదిక మీదున్న పెద్దలకు, సభలో వున్న ఆహూతులందరికి హృదయపూర్వక నమస్కారాలు తెలిపాడు. అక్కడి ప్రజలు, కళాకారులు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంఘాల వారు తన పట్ల చూపుతున్న అభిమానాన్ని చూశాక కళ్ల నీళ్ల పర్యంతం అయ్యాడు: తన ప్రసంగాన్ని ప్రారంభించే ముందు శ్రీహరి వేదిక దిగొచ్చి పూజనీయులు, పితృ సమానులయిన పెదనాన్నకు సజల నయనాలతో పాదాభివందనం చేశాడు. ఎంతో ఎత్తుకు ఎదిగిన శ్రీహరిని చూసిన ఆనందంలో ఆ వృద్ధుడి కళ్లల్లో కన్నీటి పొరలు మెరుస్తున్నాయి. ప్రేమతో శ్రీహరిని హత్తుకున్నాడు. భారమైన గుండెతో, చెమర్చిన కన్నులతో మైకు వద్దకు శ్రీహరి తడబడతూ వెళ్లాడు. గొంతు పూడుకుపోతోంది. మాటలు పెగలడం లేదు. కన్నీళ్లు చెక్కిళ్లపై ధారగా కారుతున్నాయి. భుజం మీదున్న కండువాతో కళ్లు తుడుచుకున్నాడు. అందరూ అతని ప్రసంగం కొరకు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. శ్రీహరి మాట్లాడుతున్నాడు. గద్గద స్వరంతో మాటలు తడబడుతున్నాయి.

'ఇది నేను పుట్టిన గడ్డ. నా బాల్యంలో ఆడిపాడిన ఊరు. చిన్నతనాన తల్లిదండ్రులను కోల్పోయిన దురదృష్టవంతుణ్ణి, కూలీనాలీ చేశాను. పాలేరుగా ఉన్నాను. నా ఊరు తన ఒడిలో ఇముడ్చు కోలేకపోయింది. ఊరికి దూరమయ్యాను. కరీంనగర్ పట్టణం చేరాను. తదుపరి నా జీవితమంతా పెద్దలు వివరించారు. దేనికయినా మనసుంటే మార్గముంటుంది. నేను చెప్పదలుచుకుంది ఒక్కటే. పట్టుదలతో కష్టపడితే ఏదయినా సాధించవచ్చు. కాకపోతే సమాజంలో ఎన్నోరకాల మనుషులుంటారు. కొందరు ముందటి కాళ్లకు బంధాలేస్తుంటారు. నాకు తెలిసిందల్లా ఒక్కటే. ఎన్ని ఆటంకాలు ఏర్పడినా అధైర్యపడకూడదని. ఏ గొప్ప పనైనా ఒక్కరితో సాధ్యం కాదు. మనమంతా ఐకమత్యంగా ఉండబట్టే ఈ పనులు చేయగలుగుతున్నాము.

మీరంతా ఎంతో సహృదయంతో నేను చేపట్టే సంక్షేమ కార్యక్రమాలకు చేస్తున్న శ్రమ అందిస్తున్న ఆర్థిక సహకారానికి, హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటూ.. మున్ముందు కూడా మీ సహకారం ఇట్లానే కొనసాగాలని కోరుతూ' ఆర్ద్రమైన గుండెలతో చేతులు జోడించి శ్రీహరి వేదిక దిగాడు.

శ్రీహరి తన తల్లిదండ్రుల ఆశీస్సులను అందుకోలేదు. పెదనాన్న ఆదరణకు నోచుకోలేదు. ఊరికి దూరమయ్యాడు. ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాడు. తన జీవితం ఎన్నో మలుపులు తిరిగింది. తనలా ఇతరులు కష్టపడ కూడదనుకున్నాడు. తన జీవితంపై నిప్పులు కురవాల్సిన శ్రీహరి కళ్లల్లోంచి కన్నీరు ఒలుకుతోంది. కళ్లల్లో నీటిపాయలు ఊటలు సాగుతున్నాయి. గొంతులో వెక్కిళ్లు శ్రీహరి మాటలకు అడ్డుగోడలయినాయి. ఆయన జీవితం ఒక ప్రళయం.... ఒక యజ్ఞం..... ఒక జీవనాదం...

■